సాక్షి
ములుగు

శుక్రవారం । 21 । జూలై । 2023



చక్కని చదువు..
గ్రామీణ ప్రాంత విద్యార్థులను అన్నిరంగాల్లో తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేసింది. - 8లో▸



గోదావరికి పోటెత్తిన వరద
ప్రాణహిత నది, ఎగువన ఉన్న అన్నారం బ్యారేజీ గేట్లు ఎత్తడంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని గోదావరికి వరద పోటెత్తింది. - 10లో▸

గరిష్టం/కనిష్టం
29⁰ /25⁰

వాతావరణం
ఉపరితల ఆవర్తనంతో జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురవనున్నాయి. బలమైన ఈదురు గాలులు వీస్తాయి. సాయంత్రం చల్లాగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఓటింగ్ యంత్రాలపై అవగాహన
- మొబైల్ వాహనం ప్రారంభించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి



ములుగు: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ఓటర్లకు అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ములుగు నియోజకవర్గంలో చేపట్టినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఇలా త్రిపాఠి తెలిపారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్‌లో మొబైల్ వాహనాన్ని కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు వచ్చే ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన కల్పించేందుకు ప్రచారం నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలయ్యే వరకు విస్తృత ప్రచారం చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయ భాస్కర్, ములుగు తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది ఉన్నారు.


ఇరిగేషన్ సీఈగా మారీ సుధా
ములుగు: ములుగు ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్(సీఈ)గా మారీ సుధా నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రభుత్వ స్పెషల్ సెక్రటరీ రజత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురంలో విధులు నిర్వహించారు.

రైతులు ఒకేరకం విత్తనాలు వాడొద్దు



ఏటూరునాగారం: జిల్లాలోని రైతులు ఒకే రకమైన 341 రకం విత్తనాలు కావాలని డీలర్లు, డిస్ట్రిబ్యూటర్స్‌ను అడగడం వల్ల డిమాండ్ పెరిగే అవకాశం ఉంటుందని, అందుకని ప్రభుత్వ ఆమోదిత మల్టినేషనల్ కంపెనీలకు చెందిన వివిధ రకాల మిరప విత్తనాలను వినియోగించాలని జిల్లా వ్యవసాయాధికారి గౌస్‌హైదర్ గురువారం తెలిపారు. ఇటీవల సాక్షిలో ప్రచురితమైన విత్తన దందా కథనంపై స్పందించిన ఆయన జిల్లాలోని వాజేడు, వెంకటాపురం(కె) మండలాల్లోని ఇద్దరు విత్తన డీలర్ల వద్దకు 341 రకం విత్తనం రెండు నెలల క్రితమే వచ్చిందని తెలిపారు. వాటిని పూర్తి స్థాయిలో విక్రయించారని వివరించారు. రైతులు కావాలని ఎక్కువ డబ్బులిచ్చి కొనుగోలు చేయడం వల్ల కొంత మంది వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారని తెలిపారు. దీనిపై తాము దృష్టి సారించామన్నారు. ఎవరైనా ఎక్కువ ధరకు విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు మల్టినేషనల్ కంపెనీలకు చెందిన మిర్చి విత్తనాలు అందుబాటులో ఉన్న డీలర్ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు.

కాళేశ్వరాలయంలో పూజలు



కాళేశ్వరం: కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వర ముక్తీశ్వర స్వామిని ట్రైనీ ఐఏఎస్‌లు ఉమాశంకర్, అమిత్, కిరణ్మయి, శ్రద్ధ దర్శించుకున్నారు. గురువారం వారు ఆలయానికి రాగా రాజగోపురం వద్ద ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. స్వామివారి గర్భగుడిలో అభిషేక పూజలు చేశారు. వారిని శుభానంద దేవి అమ్మవారి ఆలయంలో ఈఓ మహేష్ శాలువాతో సన్మానించారు. వారివెంట ధర్మకర్తలు సమ్మయ్య, రాంరెడ్డి, రాజయ్యలతో పాటు నోడల్ అధికారి శ్రీనివాస్, డీటీ కృష్ణ ఉన్నారు.

కరకట్ట నిర్మాణంపై సీఎంకు లేఖ
కాటారం: కాటారం మండలం లక్ష్మీపురం నుంచి గంగారం వరకు కరకట్ట నిర్మాణం కోసం రూ.50కోట్ల నిధులు వెంటనే మంజూరు చేయాలని సీఎం కేసీఆర్‌కు లేఖ రాసినట్లు ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ నాగుల అరవింద్ తెలిపారు. సరస్వతి బ్యారేజీ బ్యాక్ వాటర్‌తో మునుగుతున్న పంటలు, లక్ష్మీపురం, గుండ్రాత్‌పల్లి, దామెరకుంట గ్రామాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ప్రకటించాలని వినతిపత్రంలో కోరారు.

అమలుకాని సీఎం హామీలు

గత ఏడాది జూలై 17న రామన్నగూడెం పుష్కరఘాట్ సందర్శించిన ముఖ్యమంత్రి కేసీఆర్

- రూ.1000 కోట్లతో శాశ్వత నిర్మాణాలు చేపడుతామని హామీ
- చేపట్టని పనులు.. ఇంకా కోతకు గురవుతున్న గోదావరి పరీవాహక భూములు

ఏటూరునాగారం: గోదావరి వరదలకు ప్రజలు ఇబ్బందులు పడకుండా శాశ్వత పరిష్కారం చూపిస్తానని గత ఏడాది జూలై 17న జిల్లాలోని ఏటూరు నాగారం మండలం రామన్నగూడెం గోదావరి పుష్కరఘాట్‌కు వచ్చిన సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. ఏడాది దాటినా ముఖ్యమంత్రి ప్రజలకిచ్చిన హామీలు నెరవేరలేదు. ఐటీడీఏ సమావేశపు గదిలో గంటన్నరపాటు అధికారులతో సమీక్షించి చర్చలు, నివేదికలను పరిశీలించారు.

రూ.139 కోట్లు సరిపోవు.. వెయ్యికోట్లతో పనులు

జిల్లాలో సుమారుగా 100 కిలోమీటర్ల మేర గోదావరి ప్రవహిస్తోంది. అలాగే జయశంకర్ భూపాలపల్లి సమీపంలోని పలిమెల వద్ద కూడా గోదావరి నది ప్రవాహం ఉంటుంది. అయితే ఏటూరునాగారం, మంగపేట, మండలాల్లో గోదావరి వరదల వల్ల వందలాది ఎకరాలు పంట భూములు వరదనీటిలో కలిసిపోతున్నాయి. వరద ఉధృతి పెరగడంతో ఒడ్డు వెంట ఉన్న గ్రామాలు వణికిపోతున్నాయని సీఎం కేసీఆర్‌కు ప్రజాప్రతినిధులు విన్నవించారు. అయితే 2018లో ప్రతిపాదన చేసిన రూ.139 కోట్ల ప్యాకేజీకి మంజూరు అనుమతులిచ్చిన విషయాన్ని కేసీఆర్ గుర్తు చేస్తూ అవి సరిపోవని అవసరమైతే వెయ్యి కోట్లు అయినా ఖర్చు చేసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల గోదావరి ప్రాంతం నుంచి మొదలుకొని ఖమ్మం భద్రాద్రి కొత్తగూడెం వరకు ఎక్కడ ఏ ప్రమాదం ఉందో గుర్తించి శాశ్వతంగా నిర్మాణాలు చేపడుతామని హామీ ఇచ్చారు. వ్యాప్కోస్ సంస్థ ద్వారా సర్వేలు చేపట్టి ఏడాది పూర్తి అయినా ఇంత వరకు నివేదికలు, ప్రతిపాదనలు నోచుకోలేదు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో పరీవాహక ప్రాంతాల భూములు కోతకు గురవుతూనే ఉన్నాయి.



రాంనగర్ వద్ద నిర్మిస్తున్న రిటైనింగ్ వాల్

ఇతర హామీలు ఇలా..

- జిల్లా కేంద్రంలో ఆర్టీసీ బస్‌డిపో ఏర్పాటుకు రూ. 2.50 కోట్లు కేటాయిస్తామని చెప్పారు. అలాగే ఏటూరునాగారం మండల పరిధిలోని పస్రాకపురం గ్రామ అభివృద్ధికి రూ.50 లక్షలు మంజూరు చేస్తామన్నారు.
- ఏటూరునాగారంలో మాస్టర్ అండర్‌డ్రైయినేజీ నిర్మాణానికి నిధులు ఇస్తామని చెప్పినా ఇప్పటి వరకు వచ్చిన దాఖలాలు లేవు. అలాగే ఐలాపురం రోడ్డు పూర్తి చేయాలని, ఇందుకు అటవీశాఖ అడ్డంకులు చెప్పరాదని అప్పటి అధికారులను సీఎం హెచ్చరించారు. కానీ ఐలాపురం రోడ్డు ఇంకా పూర్తి కాలేదు.
- పస్రాకపురం గ్రామం అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరం.



గత ఏడాది రామన్నగూడెం వద్ద వరద ఉధృతిని పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్ (ఫైల్)

- ఏటూరునాగారంలో ఫైర్ స్టేషన్‌ను వెంటనే ఏర్పాటు చేస్తామని మరిచారు.

సీఎం వచ్చి వెళ్లాక జరిగినవి..

ఏటూరునాగారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రి ఆవరణలోని మాతా, శిశు సంరక్షణ ఆస్పత్రిలో డయాలసిస్‌సెంటర్ ఏర్పాటు చేశారు. రాంనగర్– రామన్నగూడెం మధ్యలో రిటైనింగ్ వాల్ రూ.6 కోట్లతో నిర్మాణం పనులు చేపట్టారు. వరద బాధితులకు రూ. 10 వేలు వారి వారి ఖాతాల్లో జమ అయ్యాయి.

సమ్మక్క సాగర్ బ్యారేజీ వద్ద గోదావరి ఉధృతిపై ఆరా తీస్తున్న కలెక్టర్



ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

వాజేడు: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల దృష్ట్యా ప్రజలు, అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మండల పరిధిలోని పేరూరు, చంద్రుపట్ల, కృష్ణాపురం, మోడికుంటలతో పాటు గత ఏడాది గోదావరి వరద అధికంగా వచ్చిన ప్రాంతాలను కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరో మూడు, నాలుగు రోజులు భారీ వర్షాలు ఉన్న నేపథ్యంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను ముందస్తు చర్యల్లో భాగంగా పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి తరలించాలని అధికారులను ఆదేశించారు. రక్షణ చర్యల్లో భాగంగా రెండు ఎన్డీఆర్‌ఎఫ్ టీములను ఏటూరునాగారం కేంద్రంగా సిద్ధంగా ఉంచామన్నారు. గర్భిణులను తక్షణమే పీహెచ్‌సీలకు తరలించాలని ఆదేశించారు. భారీ వర్షాలు ఉన్నందున గ్రామాల్లోని పాత ఇళ్లు, గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న నివాసాల్లో నివాసం ఉండే ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అలాగే గోదావరి పరీవాహక ప్రాంతంవైపు ఎవరూ వెళ్లొద్దని హెచ్చరించారు. కాళేశ్వరం నుంచి వచ్చే వరద ఉధృతంగా వస్తున్న నేపథ్యంలో తహసీల్దార్లు, ఎంపీడీఓలు తమ మండల పరిధిలోని రోడ్లు, గ్రామాలు జలమయమయ్యే ప్రాంతాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ తక్షణ చర్యలు చేపట్టాలన్నారు. ఉధృతంగా ప్రవహించే వాగుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వరద ఉధృతితో రోడ్లు తెగిపోతే అక్కడకి ప్రజలు వెళ్లకుండా బారికేడ్లు, ప్లాస్టిక్ కోన్స్ ఏర్పాటు చేయాలన్నారు. రోడ్లు, రవాణా, విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా ఆయా శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ తగిన చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దన్నారు. జీపీ సెక్రెటరీలు తమ పరిధిలోని చెరువుల నీటి మట్టాలను గమనించి ప్రజలను అప్రమత్తంగా ఉంచాలన్నారు. అనంతరం కలెక్టర్ పేరూరు పీహెచ్‌సీని పరిశీలించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ సత్యపాల్, మండల ప్రత్యేకాధికారి సర్దార్ సింగ్, తహసీల్దార్ సయ్యద్ సర్వర్, ఎంపీడీఓ విజయ ఉన్నారు.



వాజేడు: గోదావరిని పరిశీలిస్తున్న కలెక్టర్

కన్నాయిగూడెంలో..

కన్నాయిగూడెం: లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. మండల పరిధిలోని లోతట్టు ప్రాంతాలను కలెక్టర్ గురువారం పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. గోదావరిపై నిర్మించిన సమ్మక్క బ్యారేజీని పరిశీలించారు. అక్కడ గోదావరి ఉధృతి పరిస్థితులపై ఆరా తీశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సహాయం అవసరమైతే అధికారులకు తెలియజేయాలన్నారు. కలెక్టర్‌తో ఆర్డీఓ సత్యపాల్, కన్నాయిగూడెం స్పెషలాఫీసర్ వెంకయ్య, తహసీల్దార్ ఎండీ. సలీమ్, రైతుబంధు జిల్లా అధ్యక్షుడు పల్లా బుచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు వేడి ఆహారం అందించాలి

ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం: వర్షాకాలంలో కళాశాల విద్యార్థులకు వేడి వేడి ఆహారాన్ని అందించాలని ఐటీడీఏ పీఓ అంకిత్ ప్రిన్సిపాల్ వసుంధరను ఆదేశించారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల గురుకుల కళాశాలను పీఓ ఆకస్మికంగా గురువారం తనిఖీ చేశారు. కళాశాలలోని స్టాక్ రూమ్, వంట గది, సిక్ రూమ్, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం వసతి గృహం పక్కన ఏర్పాటు చేసిన ఆరోగ్య సంరక్షణ కేంద్రాన్ని పరిశీలించి మందుల వివరాలను ఏఎన్‌ఎంను అడిగి తెలుసుకున్నారు. సిక్ బోర్డర్ల రిజిస్టర్ నిర్వహణ, విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. కళాశాలలో ఏఎన్‌ఎం అందుబాటులో ఉండాలని, ఏ విద్యార్థికి అనారోగ్యంగా ఉన్నా వెంటనే ప్రాథమిక చికిత్స అందించాలని ఆదేశించారు. డైనింగ్ హాల్‌లో విద్యార్థులకు అందించే ఆహారాన్ని, మెనూ చార్టు పాతది ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. వంటగది, డార్మెంటరీలు, డైనింగ్ హాల్, మరుగుదొడ్ల వద్ద క్రమం తప్పకుండా శుభ్రంగా ఉంచాలని ప్రిన్సిపాల్, వార్డెలను ఆదేశించారు.



స్టాక్‌రూమ్‌ను పరిశీలిస్తున్న పీఓ

ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టాలి


ములుగు రూరల్: పేద విద్యార్థులను దోపిడీకి గురిచేస్తున్న ప్రైవేట్ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి తోకల రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన గురువారం విద్యార్థులతో కలిసి అదనపు కలెక్టర్ వైవీ.గణేశ్‌కు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కొనసాగిస్తున్న పాఠశాలలు, కళాశాలలపై అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. అడ్మిషన్ సమయంలో స్కాలర్‌షిప్‌పై విద్యను అందిస్తామని మాయమాటలు చెప్పి అధిక ఫీజులు వసూలు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వం పెండిగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాంప్రసాద్, నిఖిత్, పవన్, రాజేష్, విష్ణు, వివేక్, రాజేష్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

కిషన్‌రెడ్డి అరెస్టు సరికాదు

ములుగు రూరల్: హైదరాబాద్ బాటసింగారంలో ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లను సందర్శించేందుకు గురువారం వెళ్లిన కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డిని పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడం సరికాదని పార్టీ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు డబుల్ బెడ్ రూం ఇళ్లను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం దేశంలో మూడు కోట్ల ఇళ్లను పేదలకు మంజూరు చేసిందని తెలిపారు. రాష్ట్రంలో 2.5లక్షల ఇళ్లకు కేంద్రం నిధులు మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు సిరికొండ బలరాం, వాసుదేవరెడ్డి, భూక్య జవహర్‌లాల్, రాకేష్‌రెడ్డి, కుమార్, సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా కిషన్‌రెడ్డి అరెస్టును నిరసిస్తూ గోవిందరావుపేట మండల పరిధిలోని పస్రాలో పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ మేరకు మండల పార్టీ అధ్యక్షుడు మద్దినేని తేజరాజు ఆధ్వర్యంలో గురువారం నల్లా బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, స్వప్న, భారతి, పుష్ప, ప్రేమలత, కిషోర్, రవీందర్, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భాస్కర్‌రెడ్డి

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

భూపాలపల్లి రూరల్: పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎండీ.దిల్షాద్, శివకృష్ణ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా ఫారెస్ట్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటుచేసిన కార్యక్రమానికి టీఎస్ జీఓ ఫారెస్ట్ ఫోరం అధ్యక్షుడు ఉస్మాన్ హాజరయ్యారు. పాత పెన్షన్ సాధన సంకల్ప యాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

వదలని వాన.. వీడని వరద

ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి, వాగులు

- ప్రజలు బయటకు రావొద్దని హెచ్చరిస్తున్న అధికారులు
- పలుచోట్ల హెచ్చరిక బోర్డులు
- లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి
- ఐటీడీఏలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు 08717-293246



వాజేడు: మండల కేంద్రం సమీపంలో రహదారి పైకి చేరిన వరద

ఏటూరునాగారం/మంగపేట/వాజేడు: నాలుగు రోజులు కురుస్తున్న వర్షాలతో గోదావరిలోకి భారీగా వరద వచ్చి చేరుతోంది. దీంతో ఏజెన్సీలోని వాగులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. పలు గ్రామాలకు వెళ్లే రహదారులతో పాటు తెలంగాణ– ఛత్తీస్‌గఢ్ జాతీయ రహదారి నీట మునిగింది. పలుచోట్ల ప్రమాద హెచ్చరిక బోర్డులను అధికారులు ఏర్పాటు చేశారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు బయటకు రావొద్దని హెచ్చరిస్తున్నారు. గోదావరి ఉధృతి, ఉప్పొంగుతున్న వాగులను కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు ఐటీడీఏ పీఓ అంకిత్, ఆర్డీఓ సత్యపాల్, ఎస్పీ గౌష్ ఆలం, ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ గురువారం పరిశీలించారు.

మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో..

ఏటూరునాగారం మండల పరిధిలోని రామన్నగూడెం పుష్కర్ ఘాట్ వద్ద గోదావరి ఉధృతిని ములుగు ఆర్డీఓ సత్యపాల్ తహసీల్దార్ వీరస్వామి, ఎంపీడీఓ కుమార్, రామన్నగూడెం సర్పంచ్ దొడ్డ కృష్ణలతో కలిసి పరిశీలించారు. రామన్నగూడెం వద్ద బుధవారం సాయంత్రం 9.72 మీటర్లుగా కొనసాగిన వరద ఉధృతి గురువారం సాయంత్రం 6 గంటలకు 14.100 మీటర్ల ఎత్తులో మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో ఉధృతంగా ప్రవహిస్తోంది. అదే విధంగా పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చెల్పాక, ఎలిశెట్టిపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. చెల్పాక వద్ద స్థానికులు, మత్స్యకారులు వాగులు, చెరువుల వద్ద చేపల వేటకు వెళ్లొద్దని అధికారులు ఫ్లెక్సీ బోర్డులను ఏర్పాటు చేశారు.

హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

మంగపేట మండల పరిధిలోని గోదావరి ఉగ్రరూపం దాల్చి ప్రవహిస్తుండడంతో గోదావరి పరీవాహక ప్రాంతాల్లోని పలు ప్రమాదకర ప్రాంతాలకు ప్రజలు వెళ్లకుండా అధికారులు బారికేడ్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని గోదావరి వరద ముంపు పొంచి ఉన్న గ్రామాలైన పొదుమూరు(మంగపేట), కమలాపురం, కత్తిగూడెం, అకినేపల్లిమల్లారం గ్రామాల్లో మండల స్పెషలాఫీసర్ తుల రవి, తహసీల్దార్ ఎంపెల్లి శ్రీనివాసులు, ఎస్సై తాహెర్‌బాబా, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ, ఎంపీఓ శ్రీనివాస్‌తో కలిసి పర్యటించారు. రమణక్కపేట పాఠశాల ఆవరణ, మల్లూరు శివాలయం వీధిలో నిలిచిన వర్షపు నీటిని కాల్వలు తీయించి బయటకు పంపించేలా చర్యలు తీసుకున్నారు. నర్సింహాసాగర్ పరిధిలోని శనిగకుంట గ్రామానికి వెళ్లే రోడ్డుపై నిర్మించిన లోలెవల్ కాజ్‌వే పైనుంచి వరద నీరు ప్రవహిస్తుండగా హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు.

గోదావరి వరదను పరిశీలించిన పీఓ

వాజేడు మండల పరిధిలోని టేకులగూడెం వద్ద గోదావరి వరదను ఐటీడీఏ పీఓ అంకిత్ గురువారం పరిశీలించారు. అధికారులను అక్కడి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో జాతీయ రహదారి పైకి చేరిన వరదను చూశారు. పేరూరు, కృష్ణాపురం గ్రామాల మధ్యన మోడికుంట వాగు, ఒంగాల వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పూసూరు, ఏడ్జర్లపల్లి, 163వ జాతీయ రహదారిపైకి వరద నీరు వచ్చి చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. అదే విధంగా ముంపు ప్రాంతాలను ఎస్పీ గౌష్ ఆలం, ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు.

కంట్రోల్ రూమ్

వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు తక్షణ సాయం అందించేందుకు ఐటీడీఏ కార్యాలయంలో వరద హెల్ప్ లైన్ కేంద్రాన్ని గురువారం ఏర్పాటు చేశారు. 24గంటలు పనిచేసే విధంగా సిబ్బందిని నియమించారు. వరదల వల్ల ఏదైనా ప్రమాదం, వరదల్లో చిక్కుకపోవడం, ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా చూసుకునేందుకు ఈ హెల్ప్‌లైన్ దోహదపడుతుందని ఐటీడీఏ పీఓ అంకిత్ తెలిపారు. ప్రజలు ఈ నంబర్‌ను ఉపయోగించుకోవాలన్నారు. కంట్రోల్ రూమ్ నంబర్ 08717–293246 కాల్ చేసి సాయం పొందాలని సూచించారు.



కంట్రోల్‌రూమ్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది

కూలిన పెంకుటిల్లు



ఏటూరునాగారం మండలం పరిధిలోని రాంనగర్ గ్రామానికి చెందిన గార నాగేశ్వరరావు పెంకుటిల్లు గురువారం కూలిపోయింది. ముందస్తుగా ప్రమాదాన్ని గ్రహించిన నాగేశ్వరరావు భార్య సతీమణి ఇంట్లో నుంచి బయటికి వెళ్లిపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



ఏటూరునాగారం: రామన్నగూడెం వద్ద గోదావరి నది



వాజేడు: ముంపునకు గురైన రోడ్డు పరిశీలిస్తున్న పీఓ



మంగపేట: పొదుమూరు వద్ద హెచ్చరిక బోర్డు

కేసముద్రం మార్కెట్‌లో పసుపు ధర రూ.10,116


మార్కెట్‌కు అమ్మకానికి వచ్చిన పసుపు

కేసముద్రం: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం కాడిరకం పసుపు ధర రూ.10,116 పలికింది. ఈ సీజన్‌లో ఇదే రికార్డ్ ధర. సీజన్‌లో ప్రారంభం నాటినుంచి పసుపు ధర రూ.5 నుంచి రూ.6వేల వరకు పలకగా, ఇటీవల పెరుగుతూ వస్తోంది. ఈ మేరకు గురువారం మార్కెట్‌కు 50బస్తాల పసుపు అమ్మకానికి రాగా, కాడిరకం పసుపు క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.10,116, కనిష్ట ధర రూ.7,523 పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

వరదకు కొట్టుకొచ్చిన మృతదేహం

బయ్యారం: బయ్యారం, కురవి మండలాల సరిహద్దులో ప్రవహించే పాకాల యేరులోకి గురువారం ఓ మృతదేహం కొట్టుకొచ్చింది. ఈ దృశ్యాన్ని చూసిన బయ్యారం మండలం బంజార తండా వాసులు.. మృతదేహాన్ని ఫొటో తీసి పోలీసులకు పంపించారు. దీంతో వారు యేరు ప్రాంతానికి చేరుకుని మృతదేహం ఆచూకీ కోసం ప్రయత్నించారు. అయితే వరద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో జాడ కనిపించలేదు.

చక్కని చదువు..

గ్రామీణులకు వరం.. నవోదయ విద్యాలయం
- 6వ తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆగస్టు 10వ తేదీ వరకు గడువు
- వచ్చే ఏడాది జనవరి 20వ తేదీన ప్రవేశ పరీక్ష
- సీబీఎస్‌ఈ సిలబస్‌తో బోధన


జవహర్ నవోదయ విద్యాలయం మామునూర్

న్యూశాయంపేట: గ్రామీణ ప్రాంత విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వం.. మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జవహర్ నవోదయ విద్యాలయాలు ఏర్పాటు చేసింది. ఈ విద్యాలయాల ద్వారా కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా అత్యుత్తమ ప్రమాణాలతో విద్యనందిస్తూ గ్రామీణ ప్రాంత విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తోంది. ఇందులో భాగంగా 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు సీబీఎస్‌ఈ సిలబస్‌తో ఇంగ్లిష్ మీడియంలో పూర్తిగా ఉచిత విద్యనందిస్తూ ముందుకు సాగుతోంది. ఈ నేపథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఏకైక వరంగల్ నగర పరిధిలో ఉన్న మామునూర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి 2024–25 విద్యాసంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ప్రవేశ పరీక్షలో 80 మందిని ఎంపిక చేసి వారికి ఉచిత విద్యాబోధనతో పాటు ఉచిత భోజనం, వసతి, యూనిఫాం, పాఠ్యపుస్తకాలు అందించనుంది. కోఎడ్యుకేషన్ ద్వారా బాల, బాలికలకు వేర్వేరు హాస్టళ్లు ఏర్పాటు చేసి విద్యాబోధన చేపడుతోంది.

ప్రవేశానికి అర్హతలు..

ప్రభుత్వ పాఠశాలలు లేదా ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతిలో విద్యనభ్యసిస్తూ ఉండాలి. ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధి వరంగల్, హనుమకొండ, జనగామ, ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లా వాసులే అయి ఉండాలి. ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్న బాలబాలికలు 01-05-2012 నుంచి 31-07-2014 మధ్య జన్మించి ఉండాలి. ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలను తెలుసుకోవచ్చు. పూర్తి వివరాలు చదివిన తరువాతే వాటికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను జతచేసి దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తుకు ఆన్‌లైన్-(www.navodaya.gov.in) డబ్ల్యూ.డబ్ల్యూ.డబ్ల్యూ.నవోదయ.జీఓవీ.ఇన్ సమర్పించాలి. ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవడానికి వచ్చే నెల (ఆగస్టు, 10వ తేదీ)వరకు గడువుఉంది. 6వ తరగతిలో మొత్తం 80 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాల్లో వచ్చే ఏడాది జనవరి 20 తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. ఒకేసారి ప్రవేశం పొందిన విద్యార్థులు ఇంటర్ వరకు విద్యాభ్యాసం చేయొచ్చు.

వివిధ కేటగిరీలకు రిజర్వేషన్..

నవోదయ పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75 శాతం, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు నిబంధనల ప్రకారం రిజర్వేషన్ కల్పించి ప్రవేశం ఇస్తారు. బాలికలకు 1/3 వంతు సీట్లు కేటాయిస్తారు.

సీబీఎస్‌ఈ సిలబస్ ద్వారా విద్యాబోధన..

నవోదయ పాఠశాలలో ప్రవేశం పొందిన విద్యార్థులకు సీబీఎస్‌ఈ సిలబస్ ద్వారా విద్యాబోధన జరుగుతుంది. 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు ఉచితంగా విద్యనందిస్తారు. చదువుకే పరిమితం కాకుండా ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ ఇస్తారు. కంప్యూటర్ విద్య, క్రీడలు, వ్యాయామ విద్య, యోగా, ఆర్ట్స్‌లో శిక్షణ అందిస్తారు. ప్రముఖ సంస్థలతో జేఈఈ అడ్వాన్స్‌డ్, మెయిన్, నీట్ వంటి జాతీయ పరీక్షలకు ఉచితంగా శిక్షణ అందిస్తారు. అధునాతన డిజిటల్ గ్రంథాలయం, డిజిటల్ తరగతులతో విద్యాబోధన జరుగుతుంది.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు



విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి చర్యలు తీసుకుంటాం. విలువలతో కూడిన విద్యనందించడమే మా లక్ష్యం. వారి ప్రతిభా పాటవాలకు అనుగుణంగా మెరుగులు దిద్దుతూ ఉన్నత శిఖరాలు అధిరోహించేలా ప్రణాళికలు ఉంటాయి. ఉమ్మడి వరంగల్ జిల్లా బాలబాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– బి. పూర్ణిమ, ప్రిన్సిపాల్, జవహర్ నవోదయ, మామునూర్

పరీక్షా విధానం....

ఈ పరీక్షకు ప్రశ్న పత్రం మూడు విభాగాలుగా ఉంటుంది. మేధాశక్తి, గణితం, భాష పరిజ్ఞానం అనే అంశాలపై అబ్జెక్టివ్ తరహా ప్రశ్నలు ఉంటాయి. పరీక్ష 2 గంటల వ్యవధిలో రాయాల్సి ఉంటుంది.

పరీక్ష	ప్రశ్నల సంఖ్య	మార్కులు	వ్యవధి(ని.లలో)
మేధాశక్తి	40	50	60
గణితం	20	25	30
భాష పరీక్ష	20	25	30
మొత్తం	80	100	2 గంటలు

అప్రమత్తంగా ఉండాలి

- ముంపు ప్రాంతాల ప్రజలను ముందే హెచ్చరించాలి
- లోతట్టు ప్రాంతాల వాసులను తరలించాలి
- పునరావాస కేంద్రాలను సిద్ధం చేయాలి
- పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

హన్మకొండ: భారీ వర్షాలు, వరదలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. గురువారం హనుమకొండ నుంచి రాష్ట్ర మహిళ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్, ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ఐదు జిల్లాల ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, వరంగల్ పోలీసు కమిషనర్, ఎస్పీలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం రెడ్ అలర్ట్ ప్రకటించిందన్నారు. ఈ తరుణంలో గత 24 గంటల్లో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నమోదవుతున్న వర్షపాతం, వరదలు, లోతట్టు ప్రాంతాల జలమయం, వరద బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, అత్యవసర పరిస్థితుల్లో రెస్క్యూ టీమ్స్ పోషించాల్సిన పాత్ర, టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటును వివరించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల పరిస్థితి, ముందు జాగ్రత్త చర్యలను ఆయా జిల్లా కలెక్టర్లు.. మంత్రులు ఎర్రబెల్లి , మంత్రి సత్యవతి, ఇతర ప్రజా ప్రతినిధులకు వివరించారు. అనంతరం మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లాలో గల జిల్లాల్లో రెడ్, ఆరెంజ్ అలర్ట్ ఉందని, ప్రజలకు ఏ సమస్య వచ్చినా ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువస్తే వెంటనే అధికారులకు తెలపాలని సూచించారు. నియోజకవర్గ పరిధిలో ప్రజలను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత ఎమ్మెల్యేలు తీసుకోవాలన్నారు. అలాగే, కలెక్టరేట్‌లలో టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని కలెక్టర్లను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, శిథిలావస్థలోని ఇళ్లలో నివసిస్తున్న ప్రజలను వెంటనే సురక్షిత ప్రాంతాలు లేదా పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి తరలించాలన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు.

వాపును చూసి .. బలుపు అనుకుంటున్న రేవంత్ రెడ్డి

- కర్ణాటక పరిస్థితులు వేరు.. తెలంగాణ పరిస్థితులు వేరు
- రాష్ట్ర మంత్రి సత్యవతి రాథోడ్


విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సత్యవతి రాథోడ్

సాక్షి, మహబూబాబాద్: కాంగ్రెస్ పార్టీకి రాష్ట్రంలో బలం లేకపోయినా.. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వాపును చూసి బలుపు అనుకుంటున్నారని, అతనో గజినీలా మాట్లాడుతున్నారని రాష్ట్ర గిరిజన, స్త్రీ, శిశుసంక్షేమశాఖ మంత్రి సత్యవతి రాథోడ్ అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలిచినంత మాత్రాన తెలంగాణలో కూడా గెలుస్తుందని కలలు కనడం హాస్యాస్పదమన్నారు. అక్కడి పరిస్థితులు వేరని, తెలంగాణ పరిస్థితులు వేరని మంత్రి అన్నారు. ఇక్కడ ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో ప్రజా రంజక పాలన సాగుతుందని, ఇక్కడి పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. ఒక్కరిద్దరు కాంగ్రెస్ పార్టీలో చేరినంత మాత్రాన కొంపలు మునిగిపోవని, ఆ నాయకులు వెళ్తే బీఆర్‌ఎస్‌కు నష్టమేమి లేదన్నారు. తెలంగాణ రాకముందు విద్యుత్ పరిస్థితి ఏమిటీ.. తెలంగాణ వచ్చిన తర్వాత విద్యుత్ సరఫరా పరిస్థితి ఏమిటనేది రాష్ట్రంలో ఎవరిని అడిగినా తెలుస్తుందన్నారు. వ్యవసాయానికి 24గంటల ఉచిత కరెంట్ అవసరం లేదని, మూడు గంటలు ఇస్తే సరిపోతుందని రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఇక ముందు రేవంత్ రెడ్డి చౌకబారు ఆరోపణలు మానుకోవాలని అన్నారు. కాంగ్రెస్ గెలిచే చాన్సే లేదని, మూడోసారి సీఎం కేసీఆర్ గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు.

తెగిన గూడ్స్ రైలు లింక్

- విడిపోయిన బోగీలు
- కేసముద్రం, తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల మధ్య ఘటన


రంగాపురంగేట్ సమీపంలో లింక్ తెగిపోవడంతో నిలిచిన గూడ్స్ రైలు

కేసముద్రం: గూడ్స్ రైలు లింక్ తెగిపోవడంతో బోగీలు విడిపోయాయి. ఈ ఘటన గురువారం కేసముద్రం, తాళ్లపూసపల్లి రైల్వేస్టేషన్ల మధ్య జరిగింది. కేసముద్రం రైల్వేస్టేషన్ మీదుగా డౌన్‌లైన్‌లో వెళ్తున్న గూడ్స్ రైలు.. రంగాపురం గేటు సమీపంలో ఒక్కసారిగా లింక్ తెగడంతో బోగీలు విడిపోయాయి. దీనిని గమనించిన గార్డ్.. లోకోపైలట్‌కు సమాచారం అందించాడు. అప్పటికే కొంతదూరం వెళ్లిన గూడ్స్‌ను వెనక్కి తీసుకువచ్చి లింక్‌ను జాయింట్ చేశారు. ఆ తర్వాత యథావిధిగా వెళ్లింది. సుమారు గంట సమయం గూడ్స్ రైలు నిలిచింది.

భారీ వర్షాలపై జాగ్రత్తగా ఉండాలి

- ప్రతి సర్కిల్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు
- టీఎస్ ఎన్పీడీసీఎల్ సీఎండీ గోపాల్‌రావు


సీఎండీ అన్నమనేని గోపాల్‌రావు

హన్మకొండ: రాష్ట్రంలో ఎడ తెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నందున విద్యుత్ అధికారులు, ఉద్యోగులు జాగ్రత్తగా ఉండాలని టీఎస్ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ అన్నమనేని గోపాల్ రావు ఆదేశించారు. గురువారం హనుమకొండలోని టీఎస్ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 జిల్లాల (సర్కిల్) సూపరింటెండెంట్ ఇంజనీర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. గోపాల్ రావు మాట్లాడుతూ వర్షాలు తగ్గుముఖం పట్టే పరిస్థితులు కనిపించడం లేదని, ప్రతి సర్కిల్ పరిధిలో 24 గంటలు పని చేసేలా కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని ఎస్‌ఈలను ఆదేశించారు. ప్రతి ఉద్యోగి విధిగా హెడ్ క్వార్టర్స్‌లో ఉంటూ సేవలందించాలని సూచించారు. మెన్ అండ్ మెటీరియల్‌ను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఎక్కడైనా అత్యవసర పరిస్థితులు తలెత్తితే వెంటనే స్పందించేందుకు అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. నది పరీవాహక ప్రాంతాలలో విద్యుత్ సంస్థకు ఎక్కువ నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున అప్రమత్తంగా ఉంటూ కావాల్సిన, తీసుకోవాల్సిన సత్వర చర్యలు వెనువెంటనే తీసుకోవాలన్నారు. గోదావరి తీర ప్రాంతాలైన భద్రాచలం, భూపాలపల్లి, మంథని పరిసర ప్రాంతాల్లో జాగ్రత్తగా ఉండాలని కోరారు. ట్రాన్స్‌ఫార్మర్ల తరలింపుకు వాహనాన్ని సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. ఎస్పీఎం షెడ్లలో ట్రాన్స్‌ఫార్మర్ల రిపేర్లు పెంచుకోవాలని, రోలింగ్ స్టాక్ కూడా సిద్ధంగా ఉంచుకోవాలని కోరారు. ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలోని కంట్రోల్ రూమ్‌కు సంబంధిత సమాచారాన్ని చేరవేయాలని సూచించారు. వినియోగదారులు విద్యుత్ సంబంధిత సమస్యలు, ఫిర్యాదులు టోల్ ఫ్రీ నంబర్ 1800 4250028కు లేదా 1912 కు ఫోన్ చేయాలన్నారు. సమావేశంలో డైరెక్టర్లు వెంకటేశ్వరరావు, పి.గణపతి, పి.సంధ్యారాణి, పి.మోహన్ రెడ్డి, వి.తిరుపతి రెడ్డి, సీజీఎంలు, 16 సర్కిళ్ల ఎస్‌ఈలు పాల్గొన్నారు.

అరుణాచలానికి ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీస్

హన్మకొండ: తమిళనాడులోని అరుణాచలం గిరి ప్రదక్షిణకు టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సు సర్వీస్ నడుపుతోందని ఆర్టీసీ వరంగల్–1 డిపో మేనేజర్ పి.శ్రీనివాస్ రావు తెలిపారు. ఈ నెల 31న పౌర్ణమి సందర్భంగా గిరి ప్రదర్శనకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం హనుమకొండ జిల్లా బస్ స్టేషన్ నుంచి సూపర్ లగ్జరీ బస్సు సర్వీస్‌ను నడుపనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సర్వీస్ నంబర్ 92222 కలిగిన సూపర్ లగ్జరీ బస్సు.. ఈ నెల 30న మధ్యాహ్నం 03.00 గంటలకు హన్మకొండ బస్టాండ్ నుంచి బయలుదేరి.. 31వ తేదీ ఉదయం 6:00 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని కాణిపాకం చేరుకుంటుందన్నారు. ఇక్కడ విఘ్నేశ్వరుడి దర్శనం అనంతరం మధ్యాహ్నం 1.00 గంటలకు వెల్లూరులోని మహాలక్ష్మి అమ్మవారి దర్శనం అనంతరం సాయంత్రం 7.00 గంటలకు అరుణాచలం చేరుకుంటుందని వివరించారు. అరుణాచలేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత ఆగస్టు 1వ తేదీన మధ్యాహ్నం అరుణాచలం నుంచి బయలుదేరి 2న ఉదయం జోగులాంబ అమ్మవారి శక్తిపీఠం సన్నిధికి చేరుకుంటుందని తెలిపారు. ఇక్కడ దర్శనానంతరం బయలుదేరి హన్మకొండకు చేరుకుంటుంది వివరించారు. అరుణాచల గిరి ప్రదర్శనను టీఎస్‌ఆర్టీసీ టూర్ ప్యాకేజీలా అందిస్తోందన్నారు. ఈ ప్యాకేజీ టికెట్ ధర రూ.4200 నిర్ణయించినట్లు తెలిపారు. టీఎస్ ఆర్టీసీ వెబ్‌సైట్, ఆర్టీసీ బుకింగ్ కౌంటర్‌లో రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9959226047, 7382855492 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలిపారు.

నిత్యావసరాలకు టెండర్ల ఆహ్వానం

- ఐటీడీఏ పీఓ అంకిత్

ఏటూరునాగారం: 2023–2024 విద్యా సంవత్సరానికి సంబంధించి ములుగు, జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, హనుమకొండ, జనగామ, వరంగల్ జిల్లాలో ఐటీడీఏ పరిధిలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల్లో కూరగాయలు, గుడ్లు, పండ్లు, పాలు, పెరుగు, చికెన్ సరఫరాకు టెండర్లను ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీఓ అంకిత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లస్టర్, మండలాల వారీగా పాఠశాలలకు సరఫరా చేయడానికి సీల్డ్ టెండర్లు ఆహ్వానిస్తున్నామన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన వారు సెక్యూరిటీ డిపాజిట్ కింద రూ. 30వేలు, ఈఎండీ, టెండర్ ఫామ్‌ల ఖరీదు రూ.5వేలు డిమాండ్ డ్రాఫ్ట్ మాత్రమే ×డిప్యూటీ డైరెక్టర్ (టీడబ్ల్యూ), ఐటీడీఏ ఏటూరునాగారం≅ పేరున తీసి డీడీని ఐటీడీఏలోని డీడీ కార్యాలయంలో ఈనె 21 నుంచి 31వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు అందించాలన్నారు. స్వీకరించిన సీల్డ్ టెండర్ ఫామ్‌లను ఆగస్టు 4వ తేదీన సాయంత్రం ఐటీడీఏలో ఓపెన్ చేస్తామన్నారు.

ఐకమత్యంతో పాత పెన్షన్ సాధిద్దాం

- టీఎస్ సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ
- మానుకోటకు చేరుకున్న సంకల్ప రథయాత్ర



మాట్లాడుతున్న స్థిత ప్రజ్ఞ

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు ఐకమత్యంతో సీపీఎస్ రద్దుకు పోరాటం చేసి పాత పెన్షన్ సాధించుకోవాలని టీఎస్ సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ అన్నారు. పాత పెన్షన్ సాధన సంకల్ప రథయాత్ర గురువారం మానుకోట జిల్లా కేంద్రానికి చేరుకుంది. ముందుగా ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు జ్యోతిరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐఎంఏ హాల్‌లో నిర్వహించిన మహాసభకు టీఎస్ సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థిత ప్రజ్ఞ, టీఎన్‌జీఓ జిల్లా అధ్యక్షుడు హరికోట్ల రవి, వివిధ సంఘాల నాయకులు ముఖ్యతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ రాష్ట్రంలో సీపీఎస్ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సంఖ్య సుమారు రెండు లక్షలకు చేరిందని, వారందరూ ముక్తకంఠంతో సీపీఎస్ రద్దు కోరుతున్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, కోశాధికారి నరేశ్ గౌడ్, జిల్లా అధ్యక్షుడు పూసపాటి నాగముని, ప్రధాన కార్యదర్శి గోపు లక్ష్మికాంత్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రవిచంద్ర, కార్యదర్శి ఆవునూరి రవి, ప్రచార కార్యదర్శులు శ్రీకాంత్‌నాయక్, పవన్, దర్శన్ గౌడ్, మల్లికార్జున్, టీఎన్‌జీఓ నాయకులు ఫిరోజ్, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన కల్పించాలి

- అదనపు కలెక్టర్ మహేందర్‌జీ


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మహేందర్‌జీ

హన్మకొండ అర్బన్: ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ద్వారా ఓటు వేయడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ మహేందర్‌జీ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ప్రదర్శన కేంద్రాన్ని అదనపు కలెక్టర్ మహేందర్‌జీ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ద్వారా ప్రతీ ఒక్కరికి ఓటు వేసే విధానంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ ఎస్.కిరణ్‌కుమార్, సూపరింటెండెంట్ ఎం.జ్యోతి వరలక్ష్మిదేవి, పార్టీల ప్రతినిధులు శ్రీనివాస్, శ్యాంసుందర్, జయపాల్‌రెడ్డి, నాగవల్లి రజనీకాంత్, సయ్యద్ ఫయాజుల్లా, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన అదనపు కలెక్టర్

హన్మకొండ అర్బన్: జిల్లా అదనపు కలెక్టర్‌గా సీహెచ్.మహేందర్ జీ గురువారం బాధ్యతలు స్వీకరించారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అదనపు కలెక్టర్ సంధ్యారాణి నుంచి ఆయన బాధ్యతలు అందుకున్నారు. ఈసందర్భంగా వివిధ శాఖల అధికారులు ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం మహేందర్‌జీ.. కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందించారు. అలాగే హనుమకొండ ఆర్డీఓగా ర మేశ్, పరకాల ఆర్డీఓ శ్రీనివాస్ గురువారం బాధ్యతలు స్వీకరించి కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

భద్రకాళి దేవాలయంలో పూజలు

హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవాలయాన్ని గురువారం హనుమకొండ అడిషనల్ కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ సందర్శించారు. పూజల అనంతరం ఆలయ మహా మండపంలో వేదపండితులు ఆయనకు మహదాశీర్వచనం అందించారు. మహేందర్‌జీ వెంట వరంగల్ ఆర్డీఓ వాసుచంద్ర ఉన్నారు.

కేసీఆర్‌వి అబద్ధపు హామీలు

- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్


పంచాయతీ కార్మికుల సమ్మె శిబిరం వద్ద మాట్లాడుతున్న ఆర్‌ఎస్ ప్రవీణ్ కుమార్

స్టేషన్‌ఘన్‌పూర్: వచ్చే ఎన్నికల్లో లబ్ధిపొందడం కోసమే డబుల్‌బెడ్ రూమ్ ఇండ్లు, రూ.3లక్షలు అంటూ సీఎం కేసీఆర్ అబద్ధపు హామీలు ఇస్తున్నారని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మేరకు గురువారం జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు నెలనెలా వేతనాలు ఇవ్వలేని కేసీఆర్.. రూ.3లక్షలతో పేదలకు ఇళ్లు కట్టిస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎన్నికల్లో ఓట్ల కోసం బీజేపీ, బీఆర్‌ఎస్ బీసీ కులస్తుల జపం చేస్తున్నాయని ఆరోపించారు. దేశంలో బీసీ ప్రధానిగా చెప్పుకునే నరేంద్రమోదీ బీసీ జనాభాను లెక్కించడంలో ఎందుకు జాప్యం చేస్తున్నారన్నారు. మల్కాపూర్ రిజర్వాయర్‌లో భూములు కోల్పోయిన రైతులకు పరిహారం చెల్లించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని, వెంటనే రిజర్వాయర్‌ను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. స్టేషన్‌ఘన్‌పూర్ ప్రాంతంలో లెదర్ ఇండస్ట్రీ, టెక్స్‌టైల్ పార్కును పూర్తి చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు.

పంచాయతీ కార్మికుల సమ్మెకు మద్దతు..

స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద 15రోజులుగా జీపీ కార్మికులు సమ్మె చేస్తున్న విషయం తెలుసుకున్న ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు మాసగల సిద్దయ్య, జిల్లా ఇన్‌చార్జ్ నీర్మాల రత్నం, నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాళ్లపెల్లి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

సోషియాలజీ విభాగాధిపతి కొనసాగింపు


అయిలయ్య

కేయూ క్యాంపస్: కేయూ సోషియాలజీ విభాగం అధిపతిగా ఆ విభాగం ఆచార్యులు కుంట అయిలయ్యను కొనసాగిస్తూ గురువారం రిజిస్ట్రార్ టి.శ్రీనివాసరావు ఉత్తర్వులు జారీ చేశారు. సోషియాలజీ విభాగం అధిపతిగా ఆయన రెండేళ్లకుపైగా కొనసాగుతున్నారు. ఆయన పదవీకాలం ముగియడంతో ఆయననే కొనసాగిస్తూ అంటిల్‌ఫర్దర్ ఆర్డర్స్‌తో ఉత్వర్వులు జారీచేశారు.

బాలికపై లైంగికదాడి?

- వ్యక్తిపై కేసు నమోదు?

నెల్లికుదురు: ఓ బాలికపై లైంగికదాడికి పాల్పడిన ఓ వ్యక్తిపై గురువారం మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు పోలీసులు కేసు నమోదు చేసినట్లు సమాచారం. మండలంలోని తారాసింగ్ బావి తండాకు చెందిన వ్యక్తి.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై లైంగికదాడికి పాల్పడినట్లుతెలిసింది. ఈ ఘటనపై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు సదురు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం.